క్లుప్తంగా

ఆరు నెలలుగా పైపులైన్ లీకేజీ



కూడేరు: పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీతో వృథాగా ప్రవహిస్తున్న తాగునీరు

కూడేరు: సీపీడబ్ల్యూఎస్ పథకం కింద పైపులైన్ ద్వారా కూడేరు మండలంలోని గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. అయితే జల్లిపల్లిలో రైతు బంగి వెంకటేష్ పొలంలో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా అవుతోంది. నీరు వృథాగా పారుతుండడంతో పొలంలో పంట సాగు చేసుకోలేక పోతున్నానని రైతు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు స్పందించలేదు. ఆరు నెలలుగా తాగునీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేపట్టాలని రైతు, ప్రజలు కోరుతున్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో 'దుర్గం' రెండో స్థానం



రాయదుర్గం పురపాలక సంఘం

రాయదుర్గంటౌన్: ప్రభుత్వం ఇంటి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ రాయితీ ప్రకటించిందని, ఈ నెల 31లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ పూర్తిగా మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బిల్ కలెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు వడ్డీ మాఫీపై విస్తృత అవగాహన కల్పించి, వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. మరోవైపు ఆస్తి పన్ను వసూళ్లలో రాయదుర్గం పురపాలక సంఘంలో జిల్లాలోనే రెండో స్థానంలో కొనసాగుతున్నట్లు చెప్పారు. సకాలంలో పన్ను చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. రూ. 3.22 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి దాకా రూ.2.42 కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. రూ.2.97 కోట్ల నీటి పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.99 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు.

28 నుంచి రాకెట్ల నారాయణరెడ్డి క్రికెట్ టోర్నీ



పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28 నుంచి ఏప్రిల్ 28 వరకు జరిగే రాకెట్ల నారాయణరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నీ పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టోర్నీ మేనేజ్‌మెంట్ సభ్యులు సింగాడి ధనరాజ్, వడ్లసలీం మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, తండ్రి పోరాటాల యోధుడు రాకెట్ల నారాయణరెడ్డి క్రికెట్ టోర్నీని మూడేళ్లుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ టోర్నీ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతుందన్నారు. విజేతకు ట్రోఫీతో పాటు రూ.50 వేలు, రన్నర్స్‌కు టోఫ్రీతో పాటు రూ.25 వేల నగదు అందిస్తామన్నారు. పోటీలో పాల్గొనే జట్లకు ఎలాంటి ఎంట్రీ ఫీజు ఉండదన్నారు. వివరాలకు సెల్: 9885260515, 8919993962, 9849626872 లను సంప్రదించాలన్నారు.

శుక్రవారం నుంచే రంజాన్ ఉపవాస దీక్షలు

రాయదుర్గంటౌన్: రంజాన్ ఉపవాస దీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ ఖాజీలు హమహ్మద్ సైపుల్లా, అతావుర్ రెహమాన్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం చంద్రుడు కనిపించకపోవడంతో వివిధ ప్రాంతాలకు చెందిన మౌలానాలు శుక్రవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించాలని నిర్ణయించారు. గురువారం రాత్రి నుంచి తొలి తరావీ నమాజ్ కూడా మొదలవుతుందన్నారు. దీన్ని ముస్లింలు గమనించి శుక్రవారం నుంచి ఉపవాస దీక్షలు చేపట్టాలన్నారు. రాయదుర్గంలోని ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్ఎంఎంకు పలువురి రాజీనామా

ఉరవకొండ: రాయలసీమ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ (ఆర్ఎంఎం)కు బుధవారం పలువురు కీలక సభ్యులు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఆర్ఎంఎం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉన్న పామిడి తయ్యూబ్, మండల అధ్యక్షుడిగా ఉన్న దావూద్ వ్యక్తిగత కారణాలతో తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. తమ రాజీనామాలను ఆర్ఎంఎం వ్యవస్థాపక అధ్యక్షుడికు అందించామని చెప్పారు.

ఊరూవాడ ఉగాది శోభ

- తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పండుగ
- ఆలయాలకు పోటెత్తిన భక్త జనం
- పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు దంపతులు



ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి



ప్రసన్న వెంకటరమణుడి ఆలయంలో పూజలు చేస్తున్న విప్ కాపు దంపతులు



ఉరవకొండ: ఉగాది పండుగ సందర్భంగా కోలాటం ఆడుతున్న చిన్నారులు

రాయదుర్గం: రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్, ఐదు మండలాల్లో బుధవారం ఊరూవాడ ఉగాది శోభ సంతరించుకుంది. పండుగలో ప్రత్యేకతగా చెప్పుకునే పచ్చడి సేవించి తెలుగువారి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలతో పాటు ఊరూరా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

సంప్రదాయ దుస్తుల్లో హాజరైన విప్ కాపు : కోటలోని ప్రసన్న వెంకటేశ్వరుడి ఆలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సంప్రదాయ దుస్తులు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. కాపు సతీమణి కాపు భారతి, కోడలు అలేఖ్యరెడ్డి, కుమార్తె శ్రవంతిరెడ్డి, భీమవరం వియ్యంకులతో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకులు అందించిన వేప పచ్చడిని స్వీకరించారు.

భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణం..

శుభకృత్ నామ సంవత్సరం ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి తెలిపారు. అనంతరం నూతన పంచాగాన్ని వారు ఆవిష్కరించారు. ఈ కొత్త ఏడాదిలో రోగ పీడిత కారకాలు నాశనమై సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు రాశిఫలాల వారిగా పంచాంగం చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, నాయకుడు పొరాళ్ల శివ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, జెడ్పీటీసీ పీ మహేష్, కాంట్రాక్టర్లు రాజేంద్రరెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ గోవిందు, పవన్ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండలవ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో శోభకృత నామ నూతన తెలుగు సంవత్సరం ఉగాది పండుగను ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వాకిళ్లకు మామిడి తోరణాలు, రంగు పూలతో అలంకరించి, వేపపచ్చడి, తీపి వంటలు చేసుకొని కుటుంబసభ్యులంతా సంతోషంగా గడిపారు.

కణేకల్లు: మండలంలో ఉగాది పండుగను ప్రజలు జరుపుకున్నారు. చిక్కణ్ణేశ్వరస్వామి, స్వయంభేశ్వర స్వామి, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీతో చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. సాయంత్రం అర్చకుడు మృత్యుంజయ్యస్వామి పంచాంగ శ్రవణం వినిపించారు. కార్యక్రమంలో చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయధర్మకర్త జే ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ రిటైర్డ్ సీఈఓ కృష్ణారెడ్డి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండలంలో ఉగాది పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని యువకులు సాంప్రదాయ పందేలు ఆడారు. కోలాటం, చెక్కభజనలతో పాటు నిమ్మకాయ, టెంకాయలు విసరడం, గుండు ఎత్తడం, బండి ఇరుసు ఎత్తడం తదితర పందేలతో గ్రామాల్లో సందడిగా సాగింది. ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చేశారు.

బ్రహ్మసముద్రం: ఉగాది పండుగ పుర్కరించుకుని బుధవారం మండలంలోని వేపులపర్తి రంఘనాథ స్వామి ఆలయం, సంతేకొండాపురం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, బొమ్మగానిపల్లి కొల్లాపురమ్మ ఆలయం, గుడిపల్లి చిత్రలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటి గుమ్మాలను పచ్చని మామిడితోరణాలు, వేప కొమ్మలును అందంగా అలంకరించారు. ఈ ఏడాది అంతా సంతోషాలు నిండాలని ఆకాంక్షించారు.

కుందుర్పి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వడ్డెపాళ్యం ఆంజనేయస్వామి ఆలయం, తూముకుంట హరిహరేశ్వరస్వామి దేవాలయం, కుందుర్పి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం, రుద్రంపల్లి మల్లేశ్వరస్వామి ఆలయాల్లో సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని పూజలు చేశారు. కుందుర్పి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ రాధాస్వామి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి తదితరులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కెంచంపల్లిలో ఉట్టికొట్టే కార్యక్రమం, పరుగుపందేలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

శెట్టూరు: మండలంలోని 16 గ్రామా ప్రజలు బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఇంటిల్లిపాది కొత్తబట్టలు ధరించి పితృదేవతలకు పూజలు చేపట్టారు. ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. తమ తమ ఇంటి దేవుళ్ల గుడికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాలలో యువకులు నిమ్మకాయలు, టెంకాయలు విసిరే పోటీలను ఉత్సాహంగా ఆడారు.

కళ్యాణదుర్గం: ఉగాది పర్వదిన వేడుకల సందర్భంగా మంలడంలోని గ్రామాలలో ఉగాది ప్రజలు ఇంటిల్లి పాది, కుటుంబసభ్యులు నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా గడిపారు. ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలు మొదులుకుని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పితృదేవతలను ఆరాధించుకొన్నారు. గ్రామాల్లోని యువకులు నిమ్మకాయ, టెకాంయ విసరడం వంటి పోటీలు ఆడారు. ఉగాది మరుసటి దినం పట్టణంలో అక్కమాంబ జాతరను నిర్వహించుకోవడం ఆనవాయితీ. అందులో భాంగంగా జాతరకు అన్ని ఏర్పాటు ఆలయకమిటీ సభ్యులు పూర్తి చేశారు.

బొమ్మనహాళ్: మండలంలో తెలుగు నూతన సంవత్సరాది శోభకృత నామ సంవత్సర ఉగాది పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. బొమ్మనహాళ్‌లో వెంకటేశ్వరస్వామి, సత్యనారాయణ స్వామి, నేమకల్లు ఆంజనేయస్వామి, ఉంతకల్లు రుక్మిణీ పాండురంగ స్వామి, కందేపల్లి ఆంజనేయస్వామి, సంగమేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

వైభవంగా ఉగాది

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మండలంలో మేజర్ పంచాయతీలైన వజ్రకరూరు, కొనకొండ్లతో పాటు అన్ని గ్రామాల్లో ఉగాదిని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఇళ్లకు మావిడాకులు, వేపాకు కట్టి ఉగాదికి స్వాగతం పలికారు. అనంతరం ఇళ్లలో ఉగాది పచ్చడి చేసుకుని ప్రత్యేక వంటకాలు చేసుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఇళ్లలో విశేష పూజలు నిర్వహించారు. వజ్రకరూరులోని జనార్దన వేంకటేశ్వరస్వామి, షిర్డిసాయి, నగరేశ్వర స్వామి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి, మారెమ్మ, సుంకులమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జరుట్లరాంపురం గ్రామంలోని జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది వేడుకలు

ఉరవకొండ: ఉరవకొండ యోగా, ఆధ్యాత్మిక సేవా సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది పండుగ విశిష్టతను చాటుతూ బుధవారం చేపట్టిన పలు కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. స్థానిక గవిమఠంలోని గోశాలలో గోవులకు గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి పట్టుపంచె, తెల్లషర్టు, పట్టువస్త్రాలు ధరించి ర్యాలీ చేపట్టారు. తెలుగు తల్లివిగ్రహం వద్ద కోలాటం, నృత్య ప్రదర్శన అనంతరం రాష్ట్ర గీతం ఆలపించి భక్తమార్కండేయ స్వామి ఆలయం మీదుగా నుంచి షిరిడి సాయి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం షిరిడి సాయి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. తర్వాత ఆయూర్ ఆధ్వర్యంలో అత్యుత్తమ సేవలు అందించిన వారికి ఉగాది పురస్కారాలు అందించారు.

భక్తులతో ఆలయాల కిటకిట



కూడేరు: అలంకరణలో జోడు లింగాలు

కూడేరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కుటుంబంలోని పిన్నలు, పెద్దలు ఇళ్లలో పూజలు ఆచరించారు. కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి , బసాపురం ఆంజనేయ స్వామి ,అంతరగంగ, పి.నారాయణపురం, కడదరకుంటలోని ఆంజనేయ స్వామి ఆలయాలు, ముద్దలాపురం, కరుట్లపల్లిలోని రామాలయాలు, కొర్రకోడులోని శివాలయాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో దేవాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దీంతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి.



అలంకరణలో ఓబుళాపురం మహాలక్ష్మి అమ్మవారు



నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితుడు




వజ్రకరూరు: అలంకరణలో జరుట్ల రామలింగేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు



ఒంటిమిద్ది కోదండ రామస్వామి ఆలయంలో శ్రీవారి అలంకరణ



సంతే కొండాపురం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు



పూజలందుకున్న బొమ్మనహాళ్ వెంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయ స్వామి

సీసీరోడ్లు నాణ్యతగా నిర్మించాలి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



గలగలలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: సీసీ రోడ్లను నాణ్యతగా నిర్మించాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గలగలలో రూ. 24 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సర్పంచు హేమక్క, జెడ్పీటీసీ మహేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మంజునాథ తో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. నాణ్యతతో పనులు చేయాలని కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డిని విప్ కాపు ఆదేశించారు. విప్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ప్రజల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నారు. అనంతరం ప్రభుత్వ విప్‌తో పాటు ప్రజాప్రతినిధులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ గొని కాంతారెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ గోవింద, అగ్రిబోర్డ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు సిద్దప్ప, గోవిందప్ప, బాషా, బసవరాజు , హనుమన్న, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

పాతబడిన సంగమేశ్వరుడి రథం

- పొంచి ఉన్న ముప్పు



కూడేరు: దెబ్బతిన్న సంగమేశ్వరుడి రథం

కూడేరు: మండల కేంద్రంలో వెలసిన శివపార్వతుల జోడులింగాల సంగమేశ్వర ఆలయానికి ఎంతో విశిష్టత ఎంది. ఇక్కడ వెలసిన జోడు లింగాలు స్వయంభు లింగాలు కావడంతో దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా ప్రఖ్యాతి గాంచింది. ఏప్రిల్ 1 నుంచి సంగమ్వేరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 6న రథోత్సవం ఉంటుంది. రథోత్సవానికి జిల్లా నలమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలి వస్తారు. అయితే పాతబడి దెబ్బతిన్న రథంతో భక్తులకు పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. రథానికి ఉపయోగించిన చెక్కలు, కడ్డీలు దెబ్బతిని వదులయ్యాయి. రథాన్ని లాగినప్పుడు పైభాగం చెక్కలు ఊడి కిందపడే అవకాశముందంటున్నారు. గతంలో రథం అదుపు తప్పి భక్తులపైకి దూసుకెళ్లిన సంఘటన నేటికీ ఎవరూ మర్చిపోలేదని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా దేవదాయశాఖ అధికారులు స్పందించి రథానికి మరమ్మతు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



అలంకరణలో ఆంజనేయస్వామి



అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

ఉరవకొండ: మండల పరిధిలోని చిన్నముష్టూరు వద్ద వెలసిన కల్లంబండ ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా బుధవారం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని వేరుశనగ కాయలతో విశేషంగా అలంకరించారు. మరోవైపు పెన్నహోబిళం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.

25న రాతిదూలం లాగుడు పోటీలు

తాడిపత్రి టౌన్: స్థానిక కృష్ణాపురం జీరో రోడ్డులోని గంగమ్మ తల్లి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఆకుల రామాంజులరెడ్డి, ఆకుల కొండారెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 25వ తేదీన రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల పెద్దనాగిరెడ్డి ఆయన సోదరుడు 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిన్ననాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20.వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే కన్సొలేషన్ బహుమతి కింద రూ. 5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే ఎద్ల యజమానులు జతకు రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

26న పాతకల్లూరులో..

గార్లదిన్నె: మండల పరిధిలోని పాతకల్లూరులో ఉగాది, శ్రీరామ నవమి పండుగ పురస్కరించుకుని ఈనెల 26న రాతి గుండు ఎత్తే పోటీలు, ఇరుసు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాతి గుండు ఎత్తే పోటీల్లో గెలిచిన వారికి మొదటి బహుమతి రూ.4 వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతిగా రూ.1,000, అలాగే ఇరుసు ఎత్తే పందెంలో గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.6 వేలు, రెండవ బహుమతిగా రూ.3 వేలు అందజేయనున్నారు.

ఖిద్మత్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: కులమతాలకతీతంగా అందరికీ వడ్డీ లేని రుణాలు అందించేందుకు ఖిద్మత్ మ్యుచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సూర్యనగర్ 80 అడుగుల రోడ్డు మస్జిద్ ముసల్లాలో ఖిద్మత్ బ్యాంకును ప్రారంభించారు. కార్యక్రమానికి ఆయన, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ హాజరయ్యారు. వడ్డీ లేని రుణాన్ని అందించేందుకు ఖిద్మత్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేసిన సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి తన వంతు బాధ్యతగా రూ. 50 వేలు అందించారు. ఖిద్మత్ అధ్యక్షుడు హాజీ పీరా, యాసిర్ అహమ్మద్ పాల్గొన్నారు.

కమనీయం.. అప్పేచర్ల పెద్దమ్మ రథోత్సవం

పెద్దవడుగూరు: మండలంలోని అప్పేచర్ల గ్రామ ప్రజలు ఉగాది పండుగను సరికొత్తగా జరుపుకున్నారు. గత ఆరేళ్లుగా గ్రామంలో శాంతి భద్రతల దృష్ట్యా ఎలాంటి ఉత్సవాలు జరుపుకోలేదు. అయితే ఈ ఏడు ఎలాగైనా ప్రతి ఒక్కరూ ఇంటి ఇలవేల్పుగా పూజించే పెద్దమ్మతల్లికి ఉత్సవాలు నిర్వహించాలని గ్రామ పెద్దలు తీర్మాంచుకున్నారు. అమ్మవారికి నూతన రథాన్ని తయారు చేయించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆలయ కమిటీ సభ్యులు రథోత్సవాన్ని నిర్వహించారు. ఎంతో వైభవంగా జరుగుతున్న రథోత్సవాన్ని చూసి కొందరు ప్రజలు కన్నీటి పర్యంతం అయ్యారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్న ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆంజనేయుడి' బ్రహ్మరథోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని మురడిలో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 22 నుంచి 26 వరకు వివిధ పూజలు జరగనున్నట్లు ఈఓ నరసిహారెడ్డి తెలిపారు. సుప్రబాత సేవతో ప్రారంభమై వృషభ పోటీలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈనెల 23న రాత్రి ముత్యాల పల్లకి, 24న బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. 25న లంకా దహనం, 26న వృషభాల పోటీలు నిర్వహించనున్నారు.

చిరుతల సంచారంతో భయాందోళన

కుందుర్పి: మండలంలోని కలిగొలిమి,కొత్తపల్లి పరిసర ప్రాంతాల్లో చిరుతల సంచారంతో పరిసర గ్రామాల ప్రజలు రైతులు భయాందోళనకు గురిఅవుతున్నారు. మంగళవారం కెంచంపల్లికి చెందిన రాజప్ప అనే రైతుకు చెందిన మేకను, కొత్తపల్లి మారెన్నకు చెందిన పొట్టేలును చిరుతలు చంపివేసినట్లు బాధిత రైతులు తెలిపారు. ఇటీవల గ్రామాల్లో రాత్రిళ్లు చిరుతలు పశువుల పాకలు, గొర్రెల పాకల్లో చొరబడి మూగజీవాలను చంపేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. చిరుతల దాడుల్లో మృతి చెందిన మూగజీవాలకు పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'ఈక్రాప్' చేయించుకోండి

కుందుర్పి: కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా ఐదు మండలాల రైతులు రబీలో సాగుచేసిన వివిధ రకాల పంటలను ఈనెల 25 లోపు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ యల్లప్ప సూచించారు. ఇప్పటికే 5,800 ఎకరాలకు పైగా వ్యవసాయశాఖ సిబ్బంది ఈక్రాప్ నమోదు పూర్తి చేశారన్నారు. 3,589 మంది రైతులు 6 వేల ఎకరాలకు పైగా రబీ సాగులో భాగంగా బోరుబావుల కింద వివిధ రకాల పంటలు సాగు చేశారని, ఈక్రాప్‌తో పాటు ఈకేవైసీ పూర్తి చేస్తేనే ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం, రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి నిధులు జమ అవుతాయని సూచించారు.

నేడు అమ్మమాంబ తిరునాళ్ల

కుందుర్పి: బెస్తరపల్లి గ్రామంలో నేడు గురువారం గ్రామ దేవత అమ్మమాంబ తిరునాళ్ల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానిక ఓబుళదేవర దేవస్థానం నుండి జంబుగుంపల మార్గంలోని అక్కమాంబ ఆలయం వరకు భక్తులు పూర్ణకుంభాలతో గ్రామోత్సవం నిర్వహిస్తారు.